
# (కు)సంస్కారం

- కోపూరి పుష్పాదేవి

**నిన్నటి వరకూ ఆరోగ్యంగా ఉన్న బాబుకు ఈవేళ ఏమైందో ఉదయం నుండి నలతగా ఉన్నాడు. సాయంత్రం ఒళ్ళు బాగా వెచ్చబడింది.**

**హాస్పిటల్‌కు తీసుకు వెళ్దామంటే తనకీ ఊరు కొత్త. ఆయనేమో ఊళ్ళో లేరు. ఇరుగూ పొరుగూ కూడా సమయానికి ఎవరూ లేరే.. ఇప్పుడేం చేయాలి? తోచటం లేదు సరళకు.**



జ్వరం బాగా వచ్చినట్లుంది. అయ్యయ్యో వణుకుతున్నాడు. సన్నగా మూలుగుతున్నాడు. ఎలాగా.. అని ఆలోచిస్తున్న సరళకు పక్కింటి వాళ్ళమ్మాయి నీరజ వీధి చివరి ప్రైవేట్ క్లినిక్‌లో నర్స్‌గా పనిచేస్తున్నట్లు గుర్తు వచ్చింది.

"ఎవరో డాక్టరు, చదువు పూర్తి కాగానే పెట్టాడట కొత్తగా, ఎలా చూస్తాడో ఏమో? అనుభవం లేనట్లుంది. పోనీ ప్రస్తుతానికి జ్వరం తగ్గితే, తర్వాత ఆయనొచ్చాక మరో మంచి డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళవచ్చు.." అనుకుని బాబుని భుజాన వేసుకుని, తలుపు తాళం వేసి ఆ క్లినిక్‌కే వెళ్ళింది సరళ.

వెళ్ళగానే డాక్టరుగారు బాబుని చూశారు. హై టెంపరేచర్ ఉన్నదని, తడి బట్టతో బాబు ఒళ్ళంతా తుడవమన్నారు. ఇంజక్షన్ చేశారు. కాంపౌండరు చేత సెలైన్ బాటిల్ తెప్పించి డ్రిప్ పెట్టారు. చాలాసేపు బాబు దగ్గరే నిలబడి శ్రద్ధగా చూశారు. జ్వరం కొద్ది కొద్దిగా జారుతోంది. మగతగా పడుకున్నాడు బాబు.

"హల్లో" అంటూ ఎవరో ఒక యువతి వచ్చింది డాక్గరుగారి దగ్గరకు.

"హమ్మయ్య వచ్చావా, ఇదిగో ఈ బాబును చూస్తుండు. అవతల పేషెంట్లు నిలబడి పోయారు" అని బాబును ఆమెకు అప్పచెప్పి, తన గదిలోకి వెళ్ళిపోయారు డాక్టరు.

వచ్చీరాగానే ఏదో ఒక పని అప్పచెప్తాడు అని సన్నగా గొణుక్కుంటూ డాక్టరుగారు ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుంది ఆమె.

సమానమైన ఒడ్డూ పొడవులతో, చామన ఛాయతో అందం కన్న ఆకర్షణ ఎక్కువగా ఉంది ఆమెలో. దాదాపు పాతిక సంవత్సరాల వయసు ఉన్నా చురుకుతనం వల్ల ఇంకా చిన్న దానిలా కనిపిస్తోంది ఆమె.

అప్పుడు రాత్రి ఏడున్నర గంటలయింది. బాబుకి జ్వరం పూర్తిగా జారింది. ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ఆ యువతి లేచి డాక్టరుగారి గదిలోకి వెళ్ళింది. "బాబుని ఇంటికి తీసుకు వెళ్ళిపోవచ్చేమో అని డాక్టరు గారిని అడగాలి" అనుకుంది సరళ.

ఆ బిల్డింగ్ చిన్నదైనా రెండు గదులు, పెద్ద హాలులో హాస్పిటల్‌కు అనుకూలంగానే ఉన్నది. పేషెంట్లు చాలామంది వచ్చి వెళ్తున్నారుగానీ, ఇన్ పేషెంట్లు ఎవరూ లేరు. గోడలకు అందంగా, ఆరోగ్యంగా ఉన్న పసిపిల్లలు, చక్కని ప్రకృతి దృశ్యాల ఫోటోలూ ఉన్నాయి.

'అవునూ.. నీరజ కనపడలేదే ఇక్కడ.. ఇంటి దగ్గర లేకపోతే డ్యూటీకే వచ్చి ఉం టుంది" అనుకుంది తాను.

"బాబునింక ఇంటికి తీసుకు వెళ్ళవచ్చా డాక్టరుగారూ!" అడిగింది సరళ ఆయన గదికి వెళ్ళి.

"ఇప్పుడే వద్దమ్మా! ఇంటికి వెళ్ళాక జ్వరం మళ్ళీ ఎక్కువైతే రాత్రిపూట మీరు కంగారు పడతారు. ఈ రాత్రికి ఇక్కడే ఉంచి, ఉదయం తీసుకువెళ్లండి" అన్నాడు అతను.

ఆ మాటా నిజమేననిపించింది సరళకు. తన భర్త కూడా ఊళ్ళో లేరు. తనొక్కతే ఉంటే మరీ గాభరా పడుతుంది 'అలాగే' అంటూ బాబు దగ్గరకు వచ్చి, వాడు నిద్రపోతూ ఉంటే, వాడిని పక్కకు జరిపి తనూ వాడి పక్కన పడుకుంది సరళ. పగలంతా అలిసి ఉండ టంతో చిన్న కునుకు పట్టింది ఆమెకి.

తిరిగి సరళకు మెలకువ వచ్చేసరికి, పేషెంట్లందరూ వెళ్ళిపోయారేమో, హాస్పిటల్ నిశ్శబ్దంగా ఉంది. డాక్టరుగారి గది నుండి సన్నగా ఏవో మాటలు వినబడుతున్నాయి. తలుపు దగ్గరగా జరిగి, శ్రద్ధగా వినసాగింది సరళ తప్పని తెలిసినా.

"అబ్బ ఉండు డార్లింగ్, రోజు రోజుకీ మరీ చిన్నపిల్లాడివైపోతున్నావు. నీ చిలిపితనం మరీ ఎక్కువవుతోంది" ముద్దుముద్దుగా విసుక్కుం టోంది ఇంతకు ముందు బాబు దగ్గర కూర్చున్న ఆమె.

"మరేం చేయమంటావ్ రోజు రోజుకీ నీ అందాలు పెరుగుతుంటే మళ్ళీ దేవిగారు ఎప్పుడు దర్శనం ఇస్తారో ఏమో. చదివినంత వరకు చాల్లే అంటే వినవు. నిన్ను వదిలి రెం డేళ్ళు ఎలా గడపాలి? ఆ విరహం నేను భరించలేను డియర్" గునుస్తూ అంటున్నాడు డాక్టర్.

"రెండేళ్ళు ఎంతలో గడుస్తాయి? ఆ తర్వాత కాలమంతా మనదేగా?" ఓదారుస్తు న్నట్లు అన్నది ఆమె.

వాళ్ళెంత చిన్నగా మాట్లాడుకుంటున్నా, గాలికి ఓరగా తెరుచుకున్న తలుపు నుండి ఆ మాటలన్నీ స్పష్టంగా వినబడుతున్నాయి సరళకు.

"నీరజ రాగానే హాస్పిటల్ అప్పగించేసి, ఈ రాత్రికి హోటల్లో భోజనం చేసి, సెకండ్ షో చూసి, ఆ తర్వాత..." నవ్వుతున్నాడు డాక్టరు.

"ఛీ పో.. నువ్వెప్పుడూ ఇంతే" అంది ఆమె.

వింటున్న సరళకు ఒళ్ళంతా కంపర మెత్తింది. "వయసులో ఉన్న ఆడది, పరాయి మగాడితో అర్ధరాత్రి డిన్నర్లూ, సినిమాలూ, ఛీ..ఛీ.. దేశం ఎంత పాడైపోయింది? మనుష్యులు ఎంతగా దిగజారిపోతున్నారు. అంత చదువుకుని ఏం లాభం సంస్కారం లేకపోయాక.."

"ఛ ఇలాంటి డాక్టరు దగ్గర వైద్యం కూడా చేయించుకోకూడదు. బాబుని తీసుకుని, ఇప్పుడే వెళ్ళిపోతాను. ఫీజు కూడా ఇవ్వను" ఆవేశంగా అనుకుంటోంది సరళ.

అప్పుడే డ్యూటీకి వచ్చిన నీరజతో, ఆవిడెవరు? డాక్టరుతో సరసం సాగిస్తోందీ.. బాగా చదువుకున్నదీ, ఆ మాత్రం బుద్ధి ఉండక్కర్లా పోనీ మగాడు.. ఆయనకు లేదను కుంటే, ఆడదానికైనా జ్ఞానం ఉండొద్దూ?" చిన్నగానే అయినా, తన అక్కసంతా వెళ్ళ గక్కుతూ అడిగింది సరళ.

"ఎవర్ని గురించి మీరనేది? ఆమె డాక్టరుగారి భార్య, ఆమె కూడా డాక్టరే. చాలా మంచిది. వాళ్ళకో పాప కూడా ఉన్నది" చెప్పింది నీరజ.

"ఆ ఆవిడ డాక్టరుగారి భార్యా? ఎంత పొరపాటు పడ్డాను. వాళ్లను ఏదేదోగా ఊహించి దూషించానే.." వాళ్ళ మాటలు చాటుగా వినడమేగాక, డబ్బు కూడా ఎగ్గొట్టి పోదామనుకుంది తాను.

"నిజంగా సంస్కారహీనులు వాళ్ళా? తనా?"

బొమ్మలా నిలబడి, ఆలోచనలో పడిన సరళను చూసి "ఏమిటో ఈవిడ.. అర్థం కాదు" అనుకున్నది నీరజ. ✸

## అగరొత్తులు



ఎదురెదురు ఇళ్ళు
ఎంతటి వ్యత్యాసం?
గుండెలు బ్రద్దలయ్యేటట్టు
శోక సముద్రమొకవైపు
ఆనందపు కేరింతల
అమృత ముద్రలొకవైపు
యజమాని స్వర్గస్థుడైన
గుండెలు పిండే వార్తొకవైపు
వివాహవేదిక
స్వర్గద్వారాల సంరంభం మరోవైపు
మధ్యస్థంగా వేరు చేస్తూ
సన్నలని వెడల్పాటి తార్రోడ్డు
అగరొత్తులు తమ పని తను
చేసుకుపోతున్నాయి...
రెండు దగ్గర్లా
చనిపోయినవాని
కీర్తికిరీటాల గుభాళింపులవి!
నూతన జీవన స్రవంతికి
ఆనందాల సెంటు స్ప్రేలవి!

– జి. శైలూషి